ఆదివారం 10-05-2026

నినాదం నిఖార్సైన జర్నలిజం

# సాహితీ లహరి



Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

## కాశీ క్షేత్రం...



సీ.
స్వర్గపాతాళముల్ సంధాన పరచుచు
నెలకొని యున్నట్టి నిలయమిదియె
సకలలోకము చరాచరము లన్నిటికిని
యాధారభూతమై యలరుచుంది
ముల్లోకములయందు మునిజను లెల్లరన్
స్వాగతమందించు శాశ్వతముగ
పావన గంగోత్రి ప్రవహించుచుండగా
ముక్కోటి దేవతల్ మూగుదురిట

తే.గీ.
దర్శనార్థమై యేతెంచి ధన్యులగుచు
చాటిచెప్పుచు నున్నట్టి మేటి నగరి
సకల భక్త మోక్ష ప్రద స్థావరమ్ము
శివ కృపాలబ్ధ వరము కాశీపురమ్ము.



జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001
8106384812



## దీపం కళ్ళు తెరిచి

అలారం కంటే ముందు
నగరం నిద్ర లేచింది.

హారన్లన్నీ
దేవుడికి సుప్రభాతం
పాడుతున్నాయి.

మొదటి బస్సులో
ఆశలు బయలుదేరుతున్నాయి.
రెండు చిట్టి చేతులు

పాలిపోయిన
అరచేతుల్ని రుద్దుకొంటూ
ఆకలితో తిరుగుతున్నాయి.

రోడ్డు ప్రక్కన టిఫిన్ బండి
ఆవిర్లు కక్కుతూనే వుంటుంది.
ఎక్కడికెళ్లినా

నన్ను నేనే మోసుకుపోతుంటాను.
అనేకమంది మధ్య

ఒంటరిగా నడవటం
నగరం నేర్పిన విద్యేగదా!

ఒక ఆశ మనసు మీద
పడుతూ, లేస్తూ వుంటుంది.

ఎవరో ఒకరు
ఎక్కడో ఒకచోట
కలలు కంటూనే వుంటారు.

నేల నవ్వుతూనే వుంటుంది.
మట్టి వాసనతో!

వీధి దీపాలు మాత్రం
కళ్ళ ముందు చీకటి ఊద్చేస్తూ
కళ్ళు తెరిచే వుంటాయి.



- ఏటూరి నాగేంద్రరావు.
7416665323



శ్రీమతి బోయి హైమవతి భీమన్న గారి సాహిత్య ప్రయాణం అక్షరాల పట్ల మక్కువతో మొదలై, నిరంతర సాహిత్య సేవగా పరిఢవిల్లింది. డా.బోయి భీమన్న గారి జీవిత చరిత్రను 'పాలేరు నుండి పద్మశ్రీ వరకూ' పేరుతో ఒక బృహద్గ్రంథాన్ని ఆకర్షణీయమైన శైలిలో అందించారు. ఆమె చిన్ననాడే ఆకాశవాణి వేదికగా సంగీత, నాటక రంగాల్లో తన ప్రతిభను చాటుకున్నారు. మహాకవి బోయి భీమన్న గారి సహచరిగా వారి అడుగుజాడల్లో నడుస్తూ 'హైమవతీయం' వంటి కవితా సంకలనాలతో పాటు అనేక భావగీతాలను అందించారు. కేవలం రచయిత్రిగానే కాకుండా, తన సొంత నిధులతో బోయి భీమన్న గారి సాహిత్యాన్ని ప్రచారం చేయడంతో పాటు, రెండు దశాబ్దాలుగా సాహితీవేత్తలను సత్కరిస్తూ, భాషా సాహిత్యాల వికాసానికి ఆమె చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకం. ఆమె జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఈ వారం 'నినాదం' పత్రిక అందిస్తున్న ప్రత్యేక వ్యాసం.

చిన్ననాడే స్కూల్లో చదువుకునే రోజుల్లోనే ఆ పాఠశాల ప్రాంగణంలోనే చిన్న చిన్న కథల చిగుర్లు వెలిశాయి... ఆదివారంనాడు అరటి మొలచింది, సోమవారం నాడు సుడి వేసి పెరిగింది మంగళవారం నాడు మారాకు తొడిగింది, బుధవారంనాడు పొట్టి గెల వేసింది... అన్నట్టుగా ఆ చిన్నవయసులోనే సాహిత్య బీజాలు మొలకలేసి మారాకు తొడిగి ఫలించటం మొదలెట్టాయి. ఆ వయసులో రాసినవి చిన్నాచితకే అయినా రాయాలనే ఆలోచనే ఇక్కడ ముఖ్యం అనుకుంటాను. అక్షరాలతో ఆడుకున్న బాల్యం, చదువు పెరిగేకొద్దీ పుస్తకపుటల్లో పరిమళించ సాగింది. చదవటం అలవాటైతే రాయటం కరతలామలకం అవుతుందని గురువుల హితబోధ. కథలు, నవలలు మాత్రమే కాదు - ప్రాచీన గ్రంథాల గంభీరతే నా మనసుకు ఇంపైన స్వరమైంది. పుస్తకాలు చదవటం కూడా ఒక వరమే! నాలుగో తరగతి చదివేటప్పుడు మా గురువుగారు శ్రీమతి శారదాంబ గారి ప్రోద్బలంతో భారతం, భాగవతం నేర్చుకున్న రోజులు... నా జీవితానికి మొదటి దీప్తులు. కృష్ణ నిర్యాణం మొత్తం ఆమె నా చేత కంఠస్థం చేయించారు. ఆ ఘట్టం నా అంతరంగంలో నిత్యం మోగే మంత్రంలా మారింది...

# నా సాహిత్య యానం

మా నాన్నగారు ఊర్లం సంస్థానంలో కవిగా, పండితుడిగా సత్కారాలు అందుకున్న మహానుభావుడు. మద్రాస్ ఆకాశవాణి తరంగాల్లో ఆయన సాహిత్య ప్రసంగాల ప్రతిధ్వని వినిపించేది. ఆయన రాగయుక్త గానం చేస్తుంటే నేను శ్రద్ధగా ఆ నాదస్వరంలో మునిగిపోయేదాన్ని. అలా నా లోకంలో భాషా సాహిత్యాల పట్ల ప్రేమ విత్తనాలు మొలకలెత్త సాగాయి. అలా, రచన కన్నా సంగీతమే ముందుగా నన్ను అధికంగా ఆకర్షించింది.

పన్నెండేళ్ల పసివయసులోనే మద్రాస్ ఆకాశవాణిలో బాలాంత్రపు రజనీకాంతరావు గారితో కలిసి నాలుగు సంవత్సరా లపాటు లలిత గేయాలు ఆలపించిన భాగ్యం నాకు దక్కింది. అది కళాపరంగా నా జీవితంలోని ఒక స్వర్ణ అధ్యాయం. 1952దాకా ఆ ప్రయాణం అలానే కొనసాగింది. కొంచెం విరామం ఏర్పడినా, 1955లో మళ్లీ అదే వేదికపై ఆకాశవాణిలో తెలుగు నాటక విభాగంలో ఎంపిక అయ్యాను.

2021 వరకూ అనేక నాటకాలలో అనేక పాత్రలుగా జీవించాను. వివాహానంతరం, జీవిత గమనంలో కొత్త మలుపు తిరిగిన వేళ, బహుశా మావారు మహాకవి భీమన్నగారి సాహచర్యం కావచ్చు, పదాలు మళ్లీ నన్ను పలకరించాయి. మనసు కవిత్వం వైపుకు మళ్ళింది. వచన కవితల రూపంలో నా భావాలు ప్రవహిం చసాగాయి. పద్యాలంటే నాకు అపారమైన ప్రేమ ఉన్నా, అవి అను భవంతో పక్వం పొందాలని భావించి వచనమే నా వేదికగా ఎంచు కున్నాను. సామాజిక స్పందన అనండి, స్పృహ అనండి చైతన్యం అనండీ నా కవిత్వంలో సమకాలీన సామాజిక ఇతివృత్తాలు మెండుగా నిండి ఉండేవి. దాదాపు 200 కవితలు "హైమవతీయం" పేరిట రాసి సంకలనం చేశాను.

అవన్నీ వివిధపత్రికల్లో ప్రచురితమైనవే! కొన్ని పత్రికలు వరుసగా సీరియల్‌గా కూడా వేశారు. రేడియో ప్రసంగాలు, వ్యాసాలు అనేకం చేశాను. అవి, నా స్వరానికి, నా కలానికి పరిపూర్ణత్వా న్నిచ్చాయి. ఒక దశలో, భీమన్నగారి జీవిత చరిత్రను అక్షరాల్లో నిలపాలనే సంకల్పంతో అనుమతిస్తే వ్రాస్తామంటూ త్రిపురనేని సుబ్బారావు గారు వంటి వారు మా ఇంటికి చాలామంది వచ్చేవారు. భీమన్నగారు వారందరికీ చిరునవ్వే సమాధానంగా ఇచ్చేవారు. మా ఆవిడ హైమావతికి భాషా సాహిత్యాల పట్ల మంచి పరిజ్ఞానం వుంది ఆమె వ్రాయగలదు అనేవారు. ఊహ తెలియంగ గల. పాతకొత్తములు అయితే బాగుంటుంది కదా... ఈవిడ ఆ కోవకు చెందినదే అని వారికి చెప్పేవారు. అది నా మీద భీమన్నగారి విశ్వాసానికి నిదర్శనం అనుకుంటాను.
అదే నాకు కొండంత మనో ధైర్యాన్నిచ్చింది. మూడు సంవత్సరాలు తదేకంగా కృషి చేసి భీమన్నగారి జీవిత చరిత్ర పూర్తి చేశాను.
ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తూ, కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆ రచన చేశాను. ఆ గ్రంథావిష్కరణ – ఒక సాహిత్యోత్సవంలా జరిగింది.



రాజకీయ సాహిత్య ప్రముఖులు అందరూ పాల్గొన్నారు. దివాకర్ల వెంకటావధాని గారి ప్రసంగం ఆద్యంతం రసమనోజ్ఞంగా సాగింది. ఆ తరువాత కొన్నాళ్ళకి స్వాతంత్ర సమరయోధురాలు కోన కనకదుర్గా దేవి చరిత్ర రాసే అవకాశం వచ్చింది. అది పూర్తి చేశాను. మధ్య మధ్యలో హైమవతీయం కవితలు నడుస్తుండేవి. మరి కొన్నాళ్లకి కొంతమంది మిత్రులు బైబిల్ లోని. కొన్ని కథలని అను వదించమని కోరారు అది కూడా పూర్తి చేసాను. అది మరో సాహిత్య ప్రయోగంగా నిలిచింది. అనేక గ్రంథాలకు పరిచయ వాక్యాలు రాయడం నా సాధారణ కర్తవ్యంగా మారింది. భాషలు నాకు సహచరులయ్యాయి. ఇంగ్లీష్, తమిళం, హిందీ, ఉర్దూ, కొంత కన్నడ ఇవి నా భావాలకు విస్తృతి ఇచ్చిన వంతెనలు. తెలుగు సాహిత్యంలో పట్టా పొందడం నా సాధనకు ముద్ర వేసిన ఘట్టం. ప్రస్తుతం భీమన్న గారి జీవిత చరిత్ర రెండవ భాగం ముద్రణలో ఉంది. సాహిత్య కార్యక్రమాలు నిర్వహించడం, సదస్సులు ఏర్పాటు చేయడం, సాహిత్య వేదికలపై పాల్గొనడం ఇవి నా దినచర్యగా మారాయిప్పుడు. భీమన్న గారి సాహిత్యాన్ని ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లడం, ఆయన రచనలను పునర్ము ద్రించడం, ఆయన పేరుతో పురస్కారాలు అందించడం ఈ కార్యాల్లో నిమగ్నమై ఉండటం వల్ల నా స్వీయ రచనల ప్రవాహం కొంత ఆగినా, సాహిత్య సేవ మాత్రం విస్తరించింది.



అందుకే – నేను ఎక్కువగా రచనలు చేయలేకపోయినా, సాహిత్యంలోనే జీవించడం మాత్రం కొనసాగుతూనే ఉంది. రచనలకన్నా సాహిత్య సేవ గొప్పదనే నమ్మకం కూడా ఇందుకు కొంత కారణం కావచ్చు. ఈ వయసులో ఒక నిశ్శబ్ద తృప్తి కూడా నాతో పాటు నడుస్తోంది. పెన్షనర్‌గా మారిన తర్వాత కాలం నన్ను నిశ్చలంగా నిలిపివేయలేదు, అది నాకు మరో మార్గం చూపించింది. నా పెన్షన్ నుంచే ప్రతి సంవత్సరం నిష్ణాతులైన రచయితలను రూ. 25,000లతో సత్కరించే ఒక చిన్న ప్రయత్నం మొదలైంది. అది ఇప్పుడు ఇరవై రెండేళ్ల నిరంతర యజ్ఞంగా మారింది. భీమన్న గారి సాహిత్యానికి నా నమస్కారంగా దీన్ని భావి స్తాను. అదే స్ఫూర్తితో మా అమ్మాయి పేరు మీద, మా తల్లి తండ్రుల స్మృతిలోనూ ఈ సత్కారాల పరంపర కొనసాగుతోంది. కుటుంబానికీ సాహిత్యానికీ మధ్య ఒక స్నేహ సేతువులా ఈ సత్కారాల వేదికపై అక్షరాలకు సేవ చేసిన పలువురు మహనీ యులు నిలిచారు. కత్తి పద్మారావు, హేమలత లవణం, అద్దేపల్లి రామమోహన్ రావు, ఆవంత్స సోమసుందర్, మల్లెమాల, రావూరి భరద్వాజ, రావూరి ఏకాంబరాచార్యులు, ఆచార్య యన్.గోపి, వంటి ప్రముఖులు ఉన్నారు. ఇలా, నా కలం ఎంత రాసిందన్నదికంటే, నా చేతుల ద్వారా గౌరవించబడిన అక్షరాలు ఎంత వెలిగాయన్నదే నాకు మరింత ఆనందదాయకమైన విషయం.



డా. బి. ఆర్. అంబేద్కర్ చిత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం సందర్భంగా జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా. సి. నారాయణరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి శ్రీ నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి గార్లతో శ్రీమతి హైమవతీ భీమన్న.
(పాత ఫోటో ఫైల్ నుండి)

శ్రీమతి బోయి హైమవతీ భీమన్న, 9848471911



## మిగిలిన ముద్రలు

ఏదో మార్పు వస్తుందనుకున్నా
కాలం తనంతట తానే
తిరుగుతుందనుకున్నా
ఏ శబ్దాలు లేవని నమ్ముకున్నా
మనసు మాత్రం మళ్లీ అదే తంతూ
తట్టింది....

తూ తూ మంత్రాల్లా తిరిగే ఆలోచనలు
జల్లెడ వేసి పట్టుకున్నా కూడా,
తాతల కాలం నాటి గాయాల
ముద్రలు
ఇంకా మసక బారని నీడల్లా
నిలిచాయి

పుట్టుకనే తీర్పుగా చెప్పిన మాటలు
నీచాతి నీచమని ముద్ర వేసిన
సంస్కారం
కుయుక్తులతో నిండిన ఆ కథలు
పురాణాల పేరుతో పాడుబడ్డ నిజాలు
తెలిసినా అదిగతం అని
ప్రగతికి అది మొదటి
అడుగుకావాలని,

వెక్కిరించే నవ్వులు మాత్రం
ఇంకా గాలిలో మోగుతూనే ఉన్నాయి

దేశమంతా వెదికినా
మార్పుకంటే మిగిలింది అదే
నికృష్ట ఆచారాల ఆధారాలు
మనసు మీద గుచ్చిన పాత ముద్రలు
అయినా...
ఆ ముద్రల మధ్యే ఒక వెలుగు
మరచిపోని గాయాల్లోనూ
మార్పు మొలకేత్తే ఆశ...



బాబురావు చల్లగాలి, చెన్నై
9941469728

## తొవ్వలు తొలుసుకునే

లందలు దాటి,
మట్టిగప్పిన మర్మాలు దాటి,
మన్ను బుక్కి మంచీల్లు దాగి
పోగొట్టుకున్న పొద్దుల్ని
యెతుక్కునే ఎల్లవ్వల ముక్కు పుల్లలు
నా కైతలు

మా తరాల తల్లులు ఏడు కల్లాలు వూడ్చినా
ఎడమ సెయికి గాజుండని గాట్లు
నా కైతలు

కలలు పండని కండ్ల ముచ్చట్లు,
మా అవ్వలు చెప్పే కథలు
కాలిపోని కనికట్టు కాలాల ఎతలు
నా కైతలు

అంటరాని కాంటల్ల సెప్పుల్లేని సెమటల్ల
మా తల్లులు తాతలు పుల్లసీలిన పుడమి కడుపున
ముడేసుకున్న ముడుపుల యిడుపులు
నా కైతలు

మొగులుకు మొకంబెట్టి
తీరాల తిన్నెలని తవ్విన అవ్వల తోవ్వలు
నా కైతలు

బలిమోల్ల, కాలి కింద బలిపిల్ల
వూరి పొలిమేరల్ల పొలిపిల్ల కాదు
నా కైత

దుమ దుమ లాడే
నా లోపటి గాడుపు దుమారాల
గట్టిపడని గ్యాపకాలని గంపకెత్తుకొని
పిలువంగనే కొలువై, కొలుపై

బుదుగరీయంగనే బుజాలకెక్కే
నా చంటి బిడ్డలు,
నా ఆయాలు,గాయాలు
నా కైతలు

పడమట పచ్చని దర్వాజలు లేకున్నా
తూర్పున తుఫాను తూర్పారాలు.
సాహితీ శకటాలను సంకనేసుకుని వచ్చే
సోమారం సంతల సందడిల
కరి మింగిన కాంతులు
నా కైతలు

అడివి ఆకాశాన అమాస కురులీర బోసి
వేపాకు చేదు పాదుల్ల
దించబడిన దశ దిశల్లేని జోగవ్వల
గవ్వల దండలు యిసిరిన
యినుప సువ్వలు
నా కైతలు

ఎండిన మబ్బుల్ల
యెన్నెల్లోలే దాక్కొని
సిమాంట సినుకుల సిరులు
నా కైతలు

చీకటి లోకానికి పున్నాలు పుక్కిలించనీకి
ఎర్రపూల వనంల ఎదిగి
నీలాలు ఆరేసుకున్న సొరంగాల సోల్తినీ
గమ్మున తోలే గాలిని మలుపుకున్న దిగంతాలు
నా కైతలు

- జూపాక సుభద్ర





## అభినవరాగం

నిట్టూర్చిన క్షణాలన్నీ
వసంతాలవుతాయని
నాకైతే నమ్మకముంది !
చేపట్టిన పనులు సైతం
సఫలీకృతమవుతాయని
కొండంత నమ్మకముంది !
ఏం సందేహం లేదు
అల్లుకున్న ఆశలన్నీ
ఆశయాలై తీరుతాయి
అలుముకున్న చీకట్లన్నీ
తారకలై వెలుగుతాయి !
ఇంచైనా అనుమానం లేదు...
ప్రమాదాలన్నీ ప్రమోదాలై
విజయైరావతాలై
దారంతా ఊరేగుతాయి
దిగుళ్లన్నీ ప్రదీపాలై
దయాపారావతాలై
మబ్బుల్లో దారి చూపుతాయి!
కాకపోతే చేయాల్సిందల్లా...
జడత్వాన్ని విడనాడడం
మూఢత్వాన్ని వదిలేయడం
నైరాశ్యాన్ని తరిమేయడం
నిర్లక్ష్యాన్ని నిర్లక్ష్యంచేయడం !!
కూడగట్టుకోవాల్సిందల్లా...
నిండైన ఆత్మవిశ్వాసం
మెండైన ఆశాదృక్పథం
నిఖార్సైన మానవత్వం
నిక్కమైన వినయశీలం !!

పోరెడ్డి మృదుల
6303909565.

ఆదివారం 10-05-2026

నినాదం
నిఖార్సైన జర్నలిజం

సాహితీ లహరి

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

# నేను... ఈ దేశపు మూలవాసిని!

ఏ కాలి చప్పుడూ వినిపించని
ఓ కీకారణ్యంలో
వెదురు వనమంతా పల్లవించేలా
నేనే తొలి ప్రకృతి సంగీతమయ్యాను
రాళ్లపై పుష్పించిన చేతి గీతల్లో
నేనొక సంకేతమయ్యాను
బాధల గాథల్నీ, విజయగాథల్నీ
తరతరాలకు చరిత్ర గీతమయ్యాను
నా నాలిక నుంచి రాలిన శబ్దాల్లో
దేవుళ్లకు పేర్లు పలికాయి
నా గుండె చప్పుడే మొదటి భాష.
నా నీడలో పొలాలు పండాయి,
నా ఊపిరిలో ఋతువులు మారాయి.

గుర్రాల మీద దేవతలమంటూ
ఎక్కనుండో
తమ వెంట తెచ్చుకున్న గడియారాలు
నా సూర్యచంద్రులను ఖైదు చేశాయి.
నేను పెంచుకున్న
నా అడవిలో విత్తనం చల్లితే దోషమన్నాయి
చెట్టు నాకు తల్లై
ఫలాల్నిస్తుంటే నా నోటినుండి లాక్కున్నాయి
నా జ్ఞాపకాన్ని పురాణమన్నాయి.
నా నిజాన్ని నాగరికతకు అడ్డుగోడన్నాయి.
గుర్రాల మీద దూసుకొచ్చిన ఆర్యులు విజేతలయ్యారు
ఈ నేలను పుష్పించిన
ఆదిమ ద్రావిడ పరిమళాల్ని మలినం చేశారు
గెలిచిన వాడి మేధస్సు 'అగ్రం' అయ్యింది
ఓడిన వాడి శ్రమ 'దళితం' అయ్యింది!
విజయగర్వం శాశ్వతం కావడానికి
శ్రమను దోపిడీ చేసే ఒక వ్యూహం సిద్ధమైంది.
శ్రమ విభజనే కాదు
శ్రామికుల విభజన వర్ణమయ్యింది
శ్రామికుల విభజన కులమయ్యింది!

నేను... ఈ దేశపు మూలవాసిని!
ఒకప్పుడు మా వృత్తుల మధ్య కులాలు లేవు, వర్ణాలు లేవు
మాది  చెమట చుక్కలు రాసుకున్న
అవినాభావ సంబంధం
మాది నిష్కల్మషమైన పరస్పర సహకార సంస్కృతి!
మేమంతా ఒకే రక్తపు ప్రవాహంలో వేర్వేరు అలలం!
నీ విద్వేషపు విభజన మంత్రంతో
నా చుట్టూ చట్టాలు సంకెళ్ళు
నా సరిహద్దుల్లోనే నేను బందీనయ్యాను
నా వృత్తులు వర్ణాలయ్యాయి
వర్ణాలు కులాలయ్యాయి
కులాలు ధర్మావతారాలెత్తాయి
భౌతికకు, భావ వాదానికి సంఘర్షణ
శాస్త్రానికీ, ఆత్మలకీ ఎడతెగని పోరాటం
కలిసిమెలిసిన కుటుంబంలో చీలికలు!
అంతా మాయ
ఎటుచూసినా మాయ
అందర్నీ కమ్మేసింది!
దట్టమైన మేఘం కుండపోతగా వర్షం!
నేను నమ్ముకున్న నేల
నన్ను కాపాడిన ఆకాశం
నన్ను వెలిగించిన సూర్యకిరణం
నాకర్థం కాకుండా పోయింది!
నా నుండి దూరంగా పారిపోయిందో
దానికి నేనే దూరంగా పారిపోయానో
పంచభూతాలన్నీ నా వశం తప్పాయి!

ఒకనాడు...
బుద్ధి శ్రమను సింహాసనంపై కూర్చోబెట్టి
శారీరక శ్రమను పాదాల చెంతకు నెట్టేసిన వేళ
అంతరాల విత్తనాలు చల్లారు
మెదడు చేసే పని 'ఉన్నతం' అట!
మట్టిని నమ్ముకున్న పని 'హీనం' అట!
అలా గీసిన గీత...
తరతరాల బతుకుల్ని చీల్చే అగాధమైంది!
కాలక్రమేణా...
వృత్తుల పవిత్ర బాట
అపవిత్ర భావనలతో బందీఖానా!
కుమ్మరి చక్రం, వడ్రంగి వాసి, చర్మకారుడి సూది...
అవి కేవలం వృత్తులు కాలేదు,
వంశపారంపర్య సంకెళ్లయ్యాయి.
సమాజపు అవసరాలు పెరిగిన కొద్దీ
మనిషి మనిషికి మధ్య గోడలు పెరిగాయి
ఒకటి మూడై, వందలై, వేలలై...
కులమనే మహావృక్షం విషపు వేళ్లను పాతుకుంది!
***
నేను
మీరంతా దళితుడిగా పిలుస్తున్న
ఈ దేశ మూలవాసిని.
ఈ మట్టి సాక్షిగా,
ఈ ఆకాశం సాక్షిగా ఈ దేశపు మూలవాసిని.
ఎవరు అస్పృశ్యుడు?
మృదంగమై దైవ సంగీతాన్ని పలికించేది నా చేతులే!
యుద్ధ వీరుడి కత్తికి రక్షణనిచ్చే ఒరను నేనే!
రైతు దప్పిక తీర్చే తోలుతిత్తిని నేనే!
నా చేతి నిండా అంటుకున్న ఈ నలుపు
మురికి కానే కాదు
ప్రాణం లేని తోలుకు అమ్మ 'స్పర్శ'నిచ్చి
అవనిని చుట్టేసే అడుగుల వేగాన్ని పెంచిన వాణ్ణి.
ఈ దేశపు అభివృద్ధికి నేను అద్దిన అందమైన రంగున్నేను!

నేను...
ఈ మట్టితో ముడిపడి ఉన్న పురాతన స్వరాన్ని.
మీరిప్పుడు తవ్వుతున్న
ఈ సింధు నాగరికత ఇటుకల వెనుక,
నా తాత ముత్తాతల చేతి ముద్రలున్నాయి.
ఈ భూమి నాది,
ఈ చరిత్ర నాది.



ఆదిమ స్మృతులు...
వేల ఏళ్ళ క్రితం
అడవుల గుండెల్లో బతికాను.
వారసత్వపు వేటగాడి పౌరుషంతో
ప్రకృతితో మమేకమయ్యాను.
గుహల గోడలపై నేను గీసిన చిత్రాలు,
నా చరిత్రకు సాక్ష్యాలు.
చరిత్ర పుస్తకాల్లో
మీరు వెతికే అస్థిపంజరాన్ని కాదు
ఈ మట్టి పొరల్లో
సజీవంగా ప్రవహిస్తున్న రక్తాన్ని!
నేను ఈ మట్టి కళాకారుణ్ణి.
మీరు చూస్తున్న
ఈ మట్టి బొమ్మలు, ఈ ఎద్దులు...
ఈ చిన్న చిన్న దేవతా విగ్రహాలు...
వీటిని చేసిన చేతులు నావే.
ఈ మట్టిలోనే నా నమ్మకాలున్నాయి
ఈ నాగరికతకు ప్రాణం పోసిన శిల్పిని నేనే.
సింధునదీ తీరాన తొలి ఇటుక పేర్చింది నేనే
హరప్పా నాగరికత  స్నాన వాటికలో
తొలిసారిగా ఈతనేర్పింది నేనే
నా చెమట చుక్కే
ఈ నాగరికతకు పునాది రాయి.
సమస్త వృత్తులూ నా ఇంటి పేర్లే
నేటికీ వృత్తులే నా ఇంటి పేర్లు
నేటికీ శ్రమైకజీవన సౌందర్యమే
నా ఇంటి పేర్లలోని సజీవ శాస్త్రం!

నేను ఏ ఒక్క కులానికో,
నేను ఏ ఒక్క వర్గానికో పరిమితం కాలేదు
చేలోనాగలి పట్టినప్పుడు నేనో రైతును
చక్రం మీద
మట్టికి ప్రాణం పోసినప్పుడు నేనో కుమ్మరిని
లోహాన్ని కరిగించి
ముద్రలు చెక్కినప్పుడు నేనో కళాకారుడిని
నాడు నేను చేసిన ప్రతీ పనీ
నా అస్తిత్వానికో గుర్తు
నా వృత్తే నా గౌరవం..
నా శ్రమయే నా వైభవం!
కాలం మారింది.
చరిత్ర మారింది
కర్మ సిద్ధాంత రాద్ధాంతాలు
మాయలూ మర్మాలూ
వృత్తి నైపుణ్య సిద్ధాంతాలు
ఒకటా రెండా
అవి నన్నూ
నా జాతినీ చీకట్లోకి నెట్టేశాయి!
***
నా పూర్వీకులు
ప్రవహించే  సజీవ నదుల్ని కనుగొన్నారు
మట్టిని కుండగా మలిచారు
మొదటి గ్రామం విలసిల్లింది
వేటకాడి చేతిలో రాతి బాణం
అవిశ్రాంతంగా అలిసిపోయిన సంచారానికి
ఎంత ఉపశమనం!
స్థిరజీవితాన్ని గుడిసెల్లో కలలు పోతపోశారు
నా తాత ముత్తాతల చేతి మచ్చలే
నేటికీ సింధూనదీ తీరపు తవ్వకాల్లో దొరుకుతున్నాయి!

ప్రకృతితో నేను
నాతో ప్రకృతి
పరస్పర సంభాషణలు
పరస్పర సంఘర్షణలు
అతివృష్టి...అనావృష్టి
పరస్పర దోబూచిలాటలు!

తోలుతో తిత్తులు చేశాను
నిప్పును రగిలించాను
కందకుండా పాదాల్ని ముద్దాడాను
మాన మర్యాదలకు వస్త్రాన్నయ్యాను
న్యాయాన్యాయాలకు శస్త్రాన్నయ్యాను

నేను ఈ దేశపు మూలవాసిని...
ఈ మట్టిలో నా అడుగుల ముద్రలు
కాలం తుడిచేయలేని చరిత్రకు ఆనవాళ్ళు
ఈ నేలపై పడిన ప్రతి చెమటబిందువు
నా వంశపారంపర్యపు అక్షరమై
రాయిల్లోనూ, వేళ్ళలోనూ, గాలిలోనూ
నిశ్శబ్దంగా పలుకుతోంది.

నేను పుట్టింది
పాలకుల చరిత్రల్లో కాదు,
పంటల మధ్య పొద్దు పొడిచే కష్టాల్లో
నా చరిత్ర వినిపిస్తుంది
నా చేతులే ఈ నేలకి రూపం ఇచ్చాయి,
నా శ్రమే ఈ దేశానికి జీవాన్నిచ్చింది.
విచిత్రపు మాయలో నా పేరే నిషిద్ధం అయింది,
నా మాటే మౌనమైపోయింది,
నా జీవితమే ఒక ప్రశ్నార్థకంగా నిలిచిపోయింది.
నన్ను నువ్వు గుర్తుపట్టకపోయినా
గుర్తించకుండా నటిస్తున్నా
ఈ నేలే నన్ను గుర్తుపడుతుంది.
నన్ను నువ్వు తృణీకరించినా
ఈ గాలే నా పేరును పరిమళాలతో వ్యాపిస్తుంది.
నన్ను నువ్వు మౌనంగా మార్చాలనుకున్నా
ఈ పంచభూతాలే నా స్వరమై పల్లవిస్తాయి!

నా ఊపిరిలో
ఈ నేల గంధం ఉంది,
నా రక్తంలో
ఈ నదుల ప్రవాహం ఉంది.
నా చర్మం మీద
సూర్యుడి ముద్రలున్నాయి
అవి కేవలం కష్టాల గుర్తులు కావు,
అవి కాలానికి నేను పెట్టిన సంతకాలు!

నేను
కర్రతో మొదటి గీత గీసిన వాడిని,
రాయిపై మొదటి అక్షరం చెక్కిన వాడిని,
అడవిలో మొదటి గుడిసె కట్టిన వాడిని.
అయినా
నా కథకు పుటలు ఇవ్వలేదు
నా పేరుకు స్థానం ఇవ్వలేదు.
అది ఓ చరిత్ర కాదు
అది మరచిపోవాలని నేర్పిన
అందమైన ఓ అబద్ధపు పురాణం.

నా నిశ్శబ్దం పరాజయం కాదు
అది ఒక సుదీర్ఘ శ్వాస,
ఒక తిరుగుబాటు ముందరి నిశ్చలత!

నా గళం
ఒక వ్యక్తి స్వరం కాదు,
అది వేల సంవత్సరాల అణచివేత
ఒక్కసారిగా పగిలే శబ్దం.
నేనే చరిత్రలో దాచిన పుట,
నేనే భవిష్యత్తులో వెలిగే నిషిద్ధాక్షరం
భవిష్యత్తుకి నీలి రంగుల దృశ్యాల నిషిద్ధాక్షరం!

నా కవిత్వం
కన్నీటి అక్షరాలు కాదు
అవి మెరుపుల్లా పిడుగుల్లా
అణచివేతను చీల్చే పదాలు.
శ్రమైక జీవన సౌందర్య నాదాలు
సత్యాన్ని ఆవిష్కరించిన తొలివేదాలు
ఇప్పుడు నా పేరు నిషిద్ధం కాదు
ఇదొక ఆత్మ గౌరవ ప్రకటన.
ఇప్పుడు నా అక్షరం నిషిద్ధం కాదు
పాతిపెట్టిన భూమిని పెకలించుకొంటూ
సకల సంకెళ్ళనూ చీల్చుకొంటూ
నిప్పులు చిమ్ముకుంటూ
నలుదిశలా ఆత్మగౌరవాన్ని వెదజల్లే కాంతిపుంజాలు!

లోకం పితృస్వామ్యపు నీడల్లోకి వెళ్లకముందే
నేను ప్రకృతిని 'అమ్మ'గా పిలుచుకున్నాను.
నా ఇంట్లో, నా రాజ్యంలో స్త్రీయే ఆదిశక్తి
ఆమె గర్భం నుండే
ఈ సృష్టి, ఈ వృత్తులన్నీ ఉద్భవించాయి.
మట్టితో నేను చేసిన ఆ 'అమ్మతల్లి' విగ్రహమే
నా విశ్వాసానికి, నా సంస్కృతికి తొలి సాక్ష్యం.
నేను ఈ దేశపు మూలవాసిని
తరతరాల అన్వేషణలో నేను అలసిపోలేదు
నన్ను అస్పృశ్యుడిగా అంచులకు నెట్టినా
ఈ మట్టి అణువణువులో నా గతం దాగి ఉంది.
హరప్పా వీధుల్లో
నా నడకల సవ్వడి ఇంకా వినిపిస్తోంది
మొహంజొదారో స్నానవాటికల నీటిలో
నా ప్రతిబింబం ఇంకా స్పష్టంగానే కనిపిస్తోంది.
నేను...
నీ అణచివేతకు గురైన దళితుడిని కావచ్చు
ఈ దేశపు అసలైన వారసుడని నాకు తెలుసు!
ఈ దేశానికున్నంత పొగరంతా నాదేననీ తెలుసు!
వేల ఏళ్ల కిందటే నాగరికతను నేర్పిన
అమ్మతల్లి బిడ్డను నేనేనీ తెలుసు!
ఔను... ఈ మట్టి మూలవాసిని!
నేనే... ఈ దేశపు మూల వాసిని!!

- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049



ఆదివారం 10-05-2026
నినాదం నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

**సాహిత్య రచనలకు ఆహ్వానం**

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.


sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

ప్రజాస్వామ్య పరిరక్షణలో అంకితభావంతో కృషి చేస్తున్న కవులు రచయితలు ఎంతోమంది ఉన్నారు. కేవలం రచన రాయడమే కాకుండా దాన్ని ఉద్యమంగా తీసుకెళుతున్నటువంటి వారు కూడా ఉన్నారు. ఇటువంటి వారిలో వేల్పూరి కామేశ్వరరావు గారు ఒకరు. ఒకవైపు సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా ఉపయోగించుకుంటూనే, మరొకవైపు సభలు సమావేశాలు నిర్వహిస్తూ సామాజిక చైతన్యం కోసం పాటుపడుతూ ఉంటారు. సుదీర్ఘకాలం పాటు రైల్వే కార్మికుడిగా, ఉద్యోగిగా పనిచేస్తూనే ఆ కార్మికుల కోసం అంకితభావంతో పనిచేశారు. ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియడం కోసం రైలు శక్తి పేరుతో ఒక పత్రికను కూడా స్థాపించారు. ప్రస్తుతం శ్రామిక శక్తి పేరుతో పత్రికను నడుపుతున్నారు. ఆయన పదవీ విరమణ చేసినప్పటికీ నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం తపిస్తున్నారు. మరొకవైపు స్థానిక అంతర్జాతీయ సమస్యల గురించి కవిత్వం కథలు వ్యాసాలు రాస్తున్నారు. సుమారు ఐదు దశాబ్దాలుగా కార్మిక సంక్షేమం కోసం ప్రత్యక్షంగా ఉద్యమాన్ని నిర్వహిస్తూ సాహిత్యాన్ని రాస్తున్న పాహిత్య ఉద్యమకారుడు పత్రికా సంపాదకుడు కవి రచయిత వేల్పూరి కామేశ్వరరావు గారితో నినాదం పత్రిక ప్రత్యేక ప్రతినిధి డి. సాయినాథ్ రెడ్డి జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ.



# సాహిత్యం... ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగం కావాలి




**(నినాదం): ప్రజాస్వామ్యంలో ఓటు వినియోగం గురించి మీరు ప్రత్యేకించి కృషి చేస్తున్నారు. మీకే ఎందుకలా చేయాలని అనిపించింది?**

మన దేశంలో పార్లమెంట్, అసెంబ్లీలు ఓటు ద్వారానే ఏర్పడుతాయి. అవి చాలా ముఖ్య మయిన సంస్థలు. అవి బాగుంటూనే దేశం బాగుంటుంది. వాటిలో ప్రజాస్వామ్య వాదులు ఉండాలి. అవి కోటేశ్వర్ల, నేరస్థుల క్లబ్ లుగా వున్నాయి. 1969లో కమ్యూనిస్టు పార్టీ నాయకులు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి పార్లమెంట్ అసెంబ్లీ లు బాతకాని షాపులని ప్రజా విప్లవమే పరిష్కారమని బయటకు వచ్చి కృషి చేసారు. కాని అవి ఇప్పుడు కోటేశ్వర్ల, నేరస్థుల క్లబ్‌లుగా ఉన్నాయి. వీటిని మార్చు కోవాలి... అసలు ఇవి ఇలా తయారు కావడానికి కారణం ఎన్నికల్లో డబ్బు, మద్యం, బహుమతులు పంచడమే ఒక ముఖ్య కారణం. అలా పంచెవాళ్ళు ఎన్నికల నిబంధనావలి ప్రకారం నేరస్థులు. వారిని శిక్షించాలి. కాని జరగడం లేదు. జరగాలి. అందుకొరకు కమ్యూనిష్టులు, అంబేద్కర్ వాదులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజాస్వామ్యవాదులు, రచయితలు, మేధావులు కృషిచేయాలి. ఉన్నతమైనా పార్లమెంట్, అసెంబ్లీ లు ఉన్నప్పుడే దేశం బాగుంటుంది. అందుకొరకు ఒక ప్రజాస్వామ్య వాదిగా నేను సోషల్ మీడియా ను ఉపయోగించు కొని ప్రచారం చేస్తున్నాను. దేశంలోని రాజకీయ నాయకులు దేశానికి పట్టిన కాన్సర్లని పూర్వ ముఖ్య ఎన్నికల అధికారి జె. ఎం. లింగిడో అన్నారు. ఎంతో విసుగు చెంది అని ఉంటారు. అది వాస్తవమని అనిపిస్తోంది.

డబ్బు, మందు, బహుమతులు పంచె నాయకులు, వాళ్ల ప్రధానమంత్రి అయిన, ముఖ్యమంత్రులు అయిన, మంత్రులయిన, ఎంపిలు అయిన, ఎంఎల్ఎ లయిన, ఆ పార్టీల నాయకులయిన నాకు, రాజ్యంగానికి వ్యతిరేకులుగా కనబడుతారు. అంతేకాదు దేశద్రోహులుగా అనిపిస్తోంది. వాల్లను వ్యతిరేకించలేని వాల్లు కూడా మన ప్రజస్వామ్య, రాజ్యంగా, వ్యతిరేకులుగా కనబడుతారు. అంతేకాదు దేశద్రోహులుగా అనిపిస్తోంది. ఎన్నికల సంస్కరణలపై జస్టిస్ కులదీప్సింగ్ కమిటీ సిఫార్సులను అందరు తెలుసుకోవాలి. వాటి అమలుకు కృషి జరగాలి.


1.రాజకీయాల్లో నేరప్రవుత్తిని నిర్మూలించడానికి నేరచరితులైన లేదా. కోర్టులలో నేర అభియోగాలున్న అభ్యర్థులను పోటి చేసే అర్హత లేకుండా చేయడం.

2.క్రిమినల్ అభియోగలు ఉన్నప్పుడు ఏ విధంగా ప్రభుత్వ ఉద్యోగలును సస్పెండ్ చేస్తారో, అదే సూత్రాన్ని చట్టసభ సభ్యులకు వర్తించాలి.

3. నేర అభియోగాలు మోపబడిన వ్యక్తులు, ఎన్నికల్లో పోటీచేయడానికి వీలు లేకుండ ఎన్నికల ప్రవర్తనా నియమావలిలో మార్పులు చేయాలి. ఈ పని ఎన్నికల కమిషను చేయకుంటే పార్లమెంట్ ఈ చర్యలు. చేపట్టాలి.

4.(నేరస్తులు రాజకీయాలలోకి ప్రవేశించ వీలులేకుండా పకడ్బందీగా అయిన చట్టాలు ప్రవేశపెట్టి తద్వారా నేరస్తులను రాజకీయలకు దూరంగా ఉంచాలి. ప్రజాప్రాతినిధ్య చట్టం (1951) లోని సెక్షన్ 8ని సవరించి, ఈ విషయంపై నిర్ణయం తీసుకొనే అధికారం ఎన్నికల కమిషన్ కు అప్పగించాలి.

5.కోర్టు తీర్పు వచ్చేవరకు నేర అభియోగాలు కలిగిన అభ్యర్థిపై చర్యలు తీసుకొనే వీలు లేనప్పుడు కోర్టు తీర్పులను త్వరితగతం చేసి నేరస్తులైన చట్టసభ సభ్యులపై చర్యలు తీసుకోవాలి. చట్టసభ సభ్యులపైన ఇతర రాజకీయ ప్రముఖుల పైన విచారణ జరపడానికి కోర్టు స్పెషల్ బెంచీలను ఏర్పాటు చేయాలి. ఎన్నికలల్లో పెద్ద మార్పులు తీసుకు రావాలి. అందుకొరకు ఉద్యమించాలి. MLA, MP లకు పోటీచేసే వాళ్లకు ఆర్థిక నేర చరిత్ర ఉండకూడదు. ప్రభుత్వ ఉద్యోగంలో చేరాలంటే UPSC, SSC, RRB, SPSCS, DSC, మొదలయిన పరీక్షలు పాసయినా, పోలీస్ క్లియరెన్స్ కావలి. ఎలెక్షన్ కమిషన్ అధికారులు, ఉద్యోగులు కూడా ఉద్యోగంలో జాయిన్ అవ్వాలంటే పోలీస్ క్లియరెన్స్ కావాలి. గ్రూప్ డి పోస్టుల నుండి IAS అధికారుల వరకు పోలీసు క్లియరెన్స్ ఉంటేనే ఉద్యోగాలలో చేరగలరు, కాని MLA, MP స్థానిక సంస్థల ప్రతినిధులు ఎన్నికలకు ఎవరయినా ఎన్ని కేసులు ఉన్న పోటీ చేయవచ్చు.. వాళ్లు గెలిచిన తర్వాత PM, CMలు మంత్రులయితే ఆ అప్రజాస్వామిక వాదుల ఫైళ్లు ప్రభుత్వ ఉద్యోగులు మోయాలి. వాళ్లను MP, MLA లను కాపాడాలి. వాళ్ళకు, ఇష్టం ఇష్టంలేకపోయినా గౌరవించాలి. దీనిని మార్చాలి. ఎలెక్షన్ కమిషన్ MP, MLA స్థానిక సంస్థల ప్రతినిధులకు పోటీ చేస్తున్న అభ్యర్థులనుండి పోలీస్ క్లియరెన్సు సరిఫికేట్ తీసుకోవాలి. ఇంకా ఇన్కమ్ టాక్స్, ACB, CBI నుండి ఎటువంటి కేసులు లేవని సర్టిఫికెట్ తీసుకోవాలి. క్లియరెన్స్ లేకపోతే వాళ్లకు పోటీ చేసే అర్హత లేదని ప్రకటించాలి. గెలిచిన తర్వాత ACB, CBI పోలీసుల కేసులలో ఉంటె మంత్రులు, MP, MLAలు వారిని వెంటనే అనర్హులుగా చేసే విధంగా చట్టం చేయాలి. బ్యాంకులోన్లు ఎగ గొడుతున్న వాళ్ళు పవిత్రమయిన పార్లమెంట్ అసెంబ్లీ లలో ఉండే అర్హత లేదు. దీనికొరకు ఒక చట్టం తేవాలి. పార్టీలు మారితే వెంటనే MP, MLAలకు అనర్హుడిగా చేయలిసామాజిక ఉద్యమాల్లో ప్రజా ఉద్యమాల్లో, కార్మిక ఉద్యమాల్లో, మహిళా ఉద్యమాల్లో, ప్రజాతంత్ర ఉద్యమాల్లో, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై జరిగిన ఉద్యమాల్లో కేసులు ఉంటె వాటిని కేసులుగా భావించ కూడదు. ఆ కేసులను పోటీ చేయడానికి అనర్హతగా చూడ కూడదు.. అందుకోసం బలమయిన చట్టాన్ని తేవాలి. పార్లమెంట్‌లో ఉన్న కోటీశ్వర్లు, నేరస్తులు చట్టం చేయరు. చట్టం చేయించేటట్లు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు కృషి చేయాలి. దేశాన్ని ఈ అప్రజాస్వామిక, రాజ్యంగ వ్యతిరేక శక్తుల రక్షించాలి. అపుడే స్వాత్వంత్ర సమర యోధుల ఆశయాలు నెరవేరతాయి వాళ్ళ ఆశయాల అయిన స్వేచ్ఛ, సమానత్వం సౌభాతృత్వం ఏర్పడతాయి. పార్లమెంట్, ఆసెంబ్లీలు బాగుంటాయి. దేశం ఉన్నంతంగా ఉంటుంది. రాజ్యాంగం లోని ఆదేశిక సూత్రాలు అమలు చేయబడతాయి.




**(నినాదం):గత నాలుగు దశాబ్దాలుగా కార్మిక నాయకుడిగా ఎంతో అనుభవం ఉన్న మీరు అప్పటి సమస్యలకు, ఇప్పటి సమస్యలకు గల భేదాలను చెప్పండి?**

ట్రేడ్ యూనియన్ కార్యక్రమాలు, పోరాటాలు అంటే ఆర్థిక పోరాటాలే. జీతాలు, పనిగంటలు, పైనా ముఖ్యంగా ఉంటాయి. కాని మేము కొంతమంది మా రైల్వే వాగన్ వర్క్ షాప్ గుంటుపల్లి రైల్వే హై స్కూల్ లో సెక్షన్స్ పెంచాలని, పోరాటం చేయడం జరిగింది. సెక్షన్ లు పెంచడం జరిగింది. ఆ క్రమం లోనే కేంద్రియ విద్యాలయం ఏర్పాటుచేయడం జరిగింది. అంతేకాదు మా వర్క్ షాప్ వద్ద ఉన్న మద్యం షాపు ఎత్తివేయాలని కూడా విజ్ఞాపన పత్రం ఇవ్వడం జరిగింది. ఇపుడు రైల్వే ప్రవేటికరణ జరుగుతుంది. దానిని ఆపాడనికి కార్మిక సంఘాలు కృషి చేయాలి. చాలా పెద్ద పోరాటం. ఇది ఆర్థిక పోరాటం కాదు.

**(నినాదం): మీరు ఏ సంస్థలో ఉద్యోగం చేశారు?**

రైల్వేలో పర్సనల్ బ్రాంచ్ లో 1976 నుండి 2009 వరకు పని చేయడం జరిగింది.

**(నినాదం): మీకు ప్రత్యేకించి పత్రిక స్థాపించాలనే ఆలోచన ఎలా వచ్చింది?**

**(నినాదం): మీకు నచ్చిన కవిత ?**

కవితలు రాసాను. పాట రాసాను. వ్యాసాలు రాసాను. రాస్తున్నాను. నేను రాసిన కవిత.

దండలు వేయలేను.
క్షమించండి
దండలు వేయలేను
దేశం కోసం ప్రాణాలు అర్పించిన
భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ మొదలైన
అమరవీరుల విగ్రహాలకు
దండలు వేయలేను.

దేశ స్వాతంత్రం కోసం జీవితాన్ని
అంకితం చేసి
హిందు మతోన్మాదుల చేతిలో
హత్య కావించబడిన
మహాత్మా గాంధి విగ్రహానికి
దండలు వేయలేను.

మన దేశానికి
రాజ్యాంగాన్ని అందించిన
సామాజిక, ఆర్థిక విప్లవకారుడు
బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి
దండలు వేయలేను.

చదువు కోసం పాఠశాలలను నిర్మించి
చదువు చెప్పిన
మహానుభావులు
మహాత్మా జోతిభా పూలే
సావిత్రిబాయి పూలే విగ్రహాలకు
దండలు వేయలేను.

సమత కోసం, మమత కోసం, ప్రగతి కోసం
త్యాగాలు చేసిన అనేకమంది
మహానుభావుల విగ్రహాలకు
దండలు వేయలేను.

ఆ మహనుభావుల విగ్రహాలకు
ఓట్ల కోసం
డబ్బు, మద్యం, బహుయతులు పంచుతూ,
ప్రజాస్వామ్యాన్ని హత్య చేస్తున్న వారు,
రాజ్యాంగాన్ని తగల పెడుతున్నవారు,
దండలు వేస్తుంటే,
వారి చేతులు నరకలేని నేను,
ఆ మహానుభావుల విగ్రహాలకు
దండలు వేసే అర్హత నాకు లేదు.
అందుకే దండలు వేయలేను.
క్షమించండి. క్షమించండి. క్షమించండి.

రైల్ శక్తి పత్రికను డిసెంబర్ 1999 నుండి RNI రిజిస్ట్రేషన్‌తో తీసుకొని వస్తున్నాం. కరోనా పీరియడ్ నుండి 2021 నుండి తీసుకొని రావడం లేదు. రైల్ శక్తి పత్రిక ఆల్ ఇండియా రైల్వే ఎంప్లాయిస్ కాన్ఫిడరేషన్ సౌత్ సెంట్రల్ రైల్వే ఆధ్వర్యంలో తీసుకొని రావడం జరిగింది. ఆ కార్మిక సంస్థకు నేను ప్రధాన కార్యదర్శిగా ఉన్నాను. సంస్థకు ఒక పత్రిక Stomach జోనల్ కమిటీలో చర్చించి తీసుకున్న నిర్ణయం ప్రకారం తీసుకొని రావడం జరిగింది.

**(నినాదం): రైల్ శక్తి పత్రిక సంపాదకుడుగా మీ అనుభవాలు?**

పత్రిక చాలా మంది రైల్వే కార్మికుల వద్దకు తీసుకొని వెళ్ళ గలిగాం. పత్రికకు రైల్వే ఎంప్లాయిస్ ఆర్థికంగా ఎంతో సహకరించారు. స్టేషన్ మాస్టర్స్, గార్డ్స్, మినిస్టరియల్ స్టాఫ్, లోక్ రన్నింగ్ స్టాఫ్, మెకానికల్ కార్మికుల, గ్యాంగ్ మెన్ అనేక మంది కార్మికుల సమస్యలను, వారి పోరాటాలను, ఆ సంస్థల కృషి, పోరాటాలను ప్రచురించడం జరిగింది. రైల్ బోర్డు సర్కులర్స్ ను ప్రచురించడం జరిగింది. ఒక ఎడిటర్ గా రైల్వే కార్మిక సమస్యలతో పాటు, మొత్తం కార్మిక సమస్యలు పోరాటాలు, ఇతర సామాజిక, రాజకీయ విషయాలపై సంపాదకీయాలు రాయడం జరిగింది. ఇంకా మేధావులు రాసిన విషయాలు కూడా ప్రచురించడం జరిగింది. ఇంకా ముఖ్యంగా ఒక పేజీలో ఒక కవిత వేయడం జరిగేది. సామాజిక అంశాలు ప్రజలకు కవితలను ప్రచురించడం జరిగింది.

**(నినాదం): మీరు కవిత్వం రాశారు? వ్యాసాలు రాశారు. ఆ పుస్తకాల వివరాలు, వాటిలోని వస్తువు విద్య గురించి చెప్పండి?**

నేను రచయితను కాను. నాకు సమాజం లో జరుగుతున్న విషయాలు చూచినప్పుడు కడుపు మండు తుంది.మెదడు చిట్లు తుందని అనిపిస్తుంది. అప్పుడు రాయక తప్పదు. రాస్తాను. వాటిని పబ్లిష్ చేయడం జరిగింది. రైల్ శక్తి లో వ్యాసాలు, కవితలు ప్రచురించడం జరిగింది. జిజ్ఞాస తరంగాలు, అగ్ని గోళాలు, మార్పు కోసం, న్యాయం కోసం పుస్తకాలు ప్రచురించడం జరిగింది. ముఖ్యంగా ప్రజా స్వామ్యం కోసం వ్యాసాలు, కవితలు రాయడం జరిగింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభాత్రుత్వం ఉండాలనే ఆశతో రచనలు చేయడం జరిగింది.

**(నినాదం): సమకాలీన రాజకీయ అంశాలపై మన కవులు రచయితల స్పందన ఎలా ఉంది?**

అసలు మన కవులు రాజకీయ అంశాలపై స్పందన లేదు. డబ్బు, మద్యం, బహుమతులు పంచడం పై, విద్య ప్రవేటి కరణపై, మద్యం పై, ఇంకా అనేక రాజకీయ అంశాలపై రచనలు లేవు. గుర్రం జాషువా గారే ఓటు పై 9 పద్యాలు రాశారు. వాటిపై సమీక్ష నేను చూడలేదు. చాలా విచారకరం.

